10 పేజీలు అణా: ప్రారంభం 1930 R. No. M. 3152.

# జమీన్ రైతు

"Zamin Ryot" Nellore.
*(A National Kisan Weekly)*

సంపాదకుడు:
నెల్లూరు వెంకట్రామానాయుడు.

| సంపుటం 12 | శుక్రవారము : నెల్లూరు : 5—12—41 | సంచిక 49 |
|---|---|---|

# * నెల్లూరు గలాటాలు *

## శాంతి సూచనలు — దోపిళ్లు — దహనములు — కేసులు — అరెస్టులు

★ మా ప్రత్యేక విలేఖరి ★

## నెల్లూరుపురజనులకు విజ్ఞప్తి

నెల్లూరులో నిప్పటికి కొన్ని వారములుగా యథార్థమగు మతసంబంధమైన అల్లరులు లేవు. అచ్చటచ్చట నొకానొకవ్యక్తి నెదుర్కొనుట, యిండ్లను కాల్చుట, రాత్రులందు రాళ్లురువ్వుట మొదలగు దుండగీండ్ర దురంతరూపముగా సంఘ సంఘర్షణ యున్నది. ఇరుపక్షములందును నేరస్థులను పట్టుపర్చుకొనుటకు పోలీసువారన్ని ప్రయత్నములను చేయుచున్నారు. కాని నెల్లూరిప్రజలవల్లనే నివారింపదగిన గొప్ప కష్టమొకటి పోలీసువారి నెదుర్కొనుచున్నది! అదేమన, నేరము జరుగునపుడు సమక్షమున చూచినవారి సాక్ష్యమును పొందుటయే. ఇరుపక్షములందలి దుండగీండ్రు పోలీసువారియెదుట నేరము జరుగకుండునట్లు జాగ్రత్తపడుదురు. సాధారణముగ నేరము జరుగునపుడు చూచువారు దుండగీండ్రయొక్క సంఘమునకు జెందినవారుగనే యుందురు. కాని యిప్పటివరకు హిందూనేరస్థునిపై హిందువుని సాక్ష్యము గాని, అట్లనే మహమ్మదీయనేరస్థునిపై మహమ్మదీయుని సాక్ష్యము గాని యతిఘోరమగు నేరములందుకూడ పొందుటకు వీలుగాకుండుట యతిశోచనీయము. ఈ యక్రమమగు మతవిశ్వాసమువల్ల యిరుమతములవారి యందేగాక యితర జాతులలోను అమాయకులు ఘాతలకు లోనగుటయేగాక తమయిండ్లను, యాస్థులను గోల్పోవుట తటస్థించుచున్నది.

కాబట్టి యెట్టినేరమునుగాని చూచినవెంటనే నెల్లూరి హిందూ మహమ్మదీయులు నేరస్థులెవరైనగాని, తమసాక్ష్యమునిచ్చి పోలీసువారికి తోడ్పడుదురని కోరుచున్నాను.

బి. డబ్ల్యు. డే,
డిస్ట్రిక్టు మేజిస్ట్రేటు, నెల్లూరు.

●

## మద్రాసు హిందూమహాసభవారి విజ్ఞప్తి

మద్రాసు హిందూమహాసభ వారు ఇటీవల నెల్లూరుకువచ్చి ఇచటి స్థితిగతులు కండ్లారచూచి వెంటనే నెల్లూరుపౌరులకు తగినంత సహాయం పంపవలయునని యొకవిజ్ఞప్తి ని గావించిరి. 250 ఇండ్లు ఖాళీచేయబడి, 85 ఇండ్లు దోపిడిచేయబడి, 38 ఇండ్లు కాలిపోయినవి. షుమారు 70 వేలవరకు నాశనమైనట్లు అంచనావేశారు. ప్రజలు పడుచుండు బాధలు కనులకు కట్టునట్లు వర్ణిస్తు, బీదలకు తిండివసతులు కల్పిస్తు, ఖాళీచేయబడి కాలిపోయిన వారికి వసతులు మాకవసరమని రాష్ట్ర మహాజనులందరకును విజ్ఞప్తులను ప్రచురించినారు.

●

## బెంగాల్‌రాష్ట్రంవారికి విజ్ఞప్తి

అఖిలభారత హిందూమహాసభ కార్యదర్శి సభ్యులు డా॥ శ్యామప్రసాద్ ముఖర్జి గారిట్లు ప్రకటించుచున్నారు.

ఇటీవల నెల్లూరుల్లోజరిగిన ఘోరములు ఇండియాలో చదువుకొన్నవారికి పరితాపకరములుగనున్నవి. హిందువులు తమ న్యాయమైన హక్కులను కాపాడుకొనుటకుగా చేసిన ప్రయత్నములు దేశములోని హిందూసోదరుల పొగడ్తనుగన్నది. ఢక్కాలోగాని, అహమదాబాదులోగాని, నెల్లూరులోగాని కష్టపడుటచేత మన హిందూ సోదరులు దగ్గర దగ్గరకు చేరుకొనుచున్నారు. కల్పితమైన రాష్ట్రీయ సరిహద్దులు అదృశ్యమగుచున్నవి. హిందువు లందరియందును బ్రహ్మాండమైన ఏకమత్యము యేర్పడుచున్నది. ఇటువంటి పవిత్రమైన అభిమాన బంధములవల్ల అభిప్రాయభేదములు సమసిపోయి, అజేయమగుశక్తి ఉత్పత్తియగుచున్నది. ఇట్టిశక్తివల్లనే మన జాతీయ స్వాతంత్ర్యమునకుగల ఆటంకములు తొలగిపోగలవు. నెల్లూరులో కష్టపడు మన సోదరహిందువుల సంరక్షణార్థము మద్రాసు హిందూమహాసభవారు గావించిన విన్నపముతో నేనేకీభవించుచున్నాను. బంగాళములో చందాలు పోగుచేయుటకు మేము ప్రయత్నించుచున్నాము. సాధ్యమైనంత త్వరలో మద్రాసు హిందూసభవారి పేరట పంపెదము. నెల్లూరు పౌరులయెడ మాస్వల్పమైన ఉడతభక్తిని చూపగలము.

●

## కలశమహల్ కొనుగోలు

నెల్లూరు చిన్నబజారులోవుండే కలశమహల్ భవనము ఖాళీస్థలంతోసహా చిన్నబజారులోని కొందరువర్తకులు షుమారు రు 16000 లకు కొనుగోలు చేసినారట.

●

30-11-41 రాత్రి కరోడావీధిలో చేవూరు నరసారెడ్డియిల్లు తగులబడినది. చిన్నబజారులో రామమందిర సమీపంలో 2 ఘంటలు రాళ్లు పడినవి.

●

2 తేది రాత్రి పోలీసుస్టేషన్ సమీపంలో ఒకహిందువు అంగడి లూటీజరిగింది.

●

3 వ తేది రాత్రి సంతపేట మార్కెటులో నొక హిందువుని దుకాణము లూటీజరిగింది.

కుమ్మరవీధిలో నొకయిల్లు దహనమైంది.

●

## తిరిగీ 144

తిరిగీ ఒకనెలవరకు ఎవరుగానీ కత్తులు, బిమవాలు, ఈటెలుమున్నగు అపాయకరమగు ఆయుధములను ఉంచుకొనగూడదని నెల్లూరు సబ్ డి॥ మేజిస్ట్రేటుగారు ప్రకటించిరి. ఇది డిసంబరు 1 తేదినుండి అమలులోకి వచ్చింది.

●

## క్రొత్త అరెస్టులు

స్టోన్‌హౌస్ పేటలో రంతు అను సాహెబు అంగడిలో దోపిడిచేసిరని ఇదివరకే 12 మందిని అరెస్టుచేసిఉండిరి. ఇక కొందరిమీద వారంటులుగల వారిలో యీక్రిందివారు తే 4-12-41 దిన స్టేషనరీ మేజిస్ట్రేటుగారి కోర్టువద్ద హాజరై అరెస్టు కాబడిరి. వారికి జైలుపగా పిటీషన్ దాఖల్ చేశారు. నేడు విచారణకువస్తుంది. అరెస్టయినవారు కామిశెట్టి వెంకటసుబ్బయ్యశెట్టి, ఉప్పుకాయల నారాయణస్వామి, చేవూరు కృష్ణారెడ్డి, బచ్చు శ్రీరాములుశెట్టి, నందనం సుబ్బయ్య, గుండ్లపల్లి వెంకటరామానుజంశెట్టి, గుండ్లపల్లి లక్ష్మణ పెరుమాళ్‌శెట్టి, వెలిశెట్టి సుబ్బన్న, పసుమర్తి శేషాచలం.

●

## ఇంతవరకు అరెస్టయినవారు

| | |
|---|---|
| హిందువులు | 270 మంది. |
| ముస్లిములు | 60 ,, |

●

30 దిన హిందూలీగ్ ఆజ్ఞపేరుతో నొక కరపత్రము నెవరో ప్రచురించి సర్కిల్ యిన్‌స్పెక్టరును మార్చవలెననీ, షాపులు మూయవలెననీ పంచిపెట్టినారు.

హిందూమహాసభవారు ఆప్రకటన నిరాధారమైనదనీ, అంగళ్లు మూయవవసరములేదని యొక ప్రకటన చేశారు.

●

## మసీదులవద్ద మేళములు వాయించ వచ్చును

### ఇంకొక డిక్రీ (కడప)

కడపపట్టణంలోనుండే ముస్తఫర్ ఖాజా అను ముస్లిం మకాము సమీపంలోని వీధులగుండా హిందువులు మేళములతో ఉత్సవములు తీసికొని పోవునపుడు ముసల్మానులు అడ్డుపడకుండా పర్మనెంటు ఇంజక్షన్ కోరబడెను.

జి॥ మునసబ్ గారు ఇంజక్షనిస్తు యీవిధముగా వ్రాసిరి: దావా మసీదుముందరగానీ, ఇతర మసీదుల ముందరగానీ ఇంతవరకు హిందువులు మేళములతోటి ఉత్సవములతో పోకపోయినను, అంతమాత్రాన రాత్రింబవళ్లు తమ మసీదులవద్ద మేళములు వాయించరాదని ప్రతివాదులు కోరుటకు హక్కులేదు. సాముదాయక ప్రార్థన సమయములో గలభాజరిగిన శాంతిభంగము కలుగునని, తత్రక్షణకొరకు ఆకాలములో ఉత్సవములు మేళములు రాకూడదని కోరవచ్చును. గనుక ఇస్లాం మతప్రకారం సముదాయక ప్రార్థన కాలంలో 50 గజములులోపల మేళములు కూడదనియు ఇతరకాలములో హిందువులు మేళములతో ఉత్సవములు జరుపుకొనవచ్చుననియు తీర్పుచెప్పిరి.

●

## అరవమారిచావు

అరవమారి అనునొక కళాదిపాకింవాసి 2-12-41 దిన చనిపోయి 3 ది ఉదయం 9-30 మీద మెటర్నిటీ ఆసుపత్రి, ట్రంకురోడ్డు మీదుగా మేళములు వాయించుకొనుచు 200 మంది శవమును ఉత్సవములో ఊరేగించుకొనుచూ గొనిపోయిరి. సంతపేట మసీదువద్ద మేళములను నిలుపకుండా వాయించుచూపోయిరి. పోలీసులు కూడా వెంటవచ్చిరి. ఎవ్వరును ఆక్షేపించక శాంతముగా జరిగిపోయింది.

●

నెల్లూరు జిల్లాబోర్డువారు రు 2000 న్ను, మునిసిపాలిటీవారు రు 500 న్ను నెల్లూరులో గలాటాలవల్ల నష్టపడినవారి సహాయార్థం శాంక్షన్ చేశారు.

●

## అ॥ భా॥ హి॥ సభ సమావేశం

అఖిలభారత హిందూమహాసభను డిసంబరు 24, 25, 26, 27 తేదులలో తమ రాష్ట్రంలో జరుపుకొందని దర్భంగ మహారాజాధి రాజాగారాహ్వానించారు.

— —

కథ :-

# జీవాహుతి

—ధరణికోట శ్రీరాం.

"నేను వూరికి పోతున్నాను"

నిశ్శబ్ధం!

"సాయంకాలం"

క్రీగంటితో రంగనాథం వైపు చూచింది కమల.

"అబ్బా! రానురాను మరీ పెంకిపిల్లవై పోతున్నావు!

చిన్న మందహాసం వికసించింది కమల పెదవి మీద.

"ఎక్కడికీ ప్రయాణం?"

చేతిలో కుంకుమగిన్నె చూపించి కొంటెగా నవ్వింది. ఆ నవ్వులోంచి వెల్లువలై ప్రవహించిన వెల్గులో మిలమిలలాడింది కమలం.

సిగ్గుతో, ప్రక్కకు మరలుతుండే ఒకగులాబి పూవుమీద వ్రాలి, మకరందాన్ని గోలిందో భ్రమరం! తోటలో.

ఆ పుష్పానికది కడసా............

"అమ్మాయి! ఏమి చేస్తున్నావే? ప్రొద్దు పోలేదు! వెంకమ్మగారింట్లోను, సరస యింట్లోను పిలిచిరా చాలు"

"ఇదో పోతున్నానమ్మా."

విశ్వమానవ సృష్టిలో ఒకహృదయం కొట్టింపు వేగంతో కొట్టుకోసాగింది.

కమల రోడ్డువెంబడి నడుస్తుంటే కిటికీలోంచి చూస్తుండే రంగనాథం మెదడులో యెన్నో వూహలు పచారుచేయ మొదలెట్టాయి.

ఊర్వశిలాంటి వుత్తమ సౌందర్యం కాకపోయినా కమలలోని అనిర్వాచ్యమైన, ముగ్ధత్వం, కోమలత్వం, కండ్లలో తాండవమాడే చిలిపితనం, ఓమారు చూచినవారికి చిరకాలం మరుపు రాదంటే సత్యదూరంకాదు.

వివాహమై ఆరునెలలు.

"కమల నా భార్య!" అని సగర్వంగా తాను తనలో అనుకొని మురిసిపోయేవాడు రంగనాథం.

తనయింటికి దీపంగావుంటుంది కమల. అందరు "ఈమె రంగనాథం భార్య! ఎంతముచ్చటగా వుంది!" అంటారు. తనకుకూడా గ్రామంలో ఎంతో ప్రతిష్టగా......

దూరాన తప్పెట శబ్దం!

పెద్దపులివేషం కాబోలు!

గొందుసందుల్లోంచి ప్రవాహంగావచ్చి వీధిలోకి దుమికింది జనం.

దుమ్ము లేపుకుంటూ గిఱ్ఱున మూలతిరిగివచ్చి ఆగింది ఒకపోలీసు లారీ!

టక టకమని పోలీసువారు దిగారు.

మరుక్షణంలో మాయమై పోయింది జనం వచ్చినత్రోవన్నే.

ఇంతలో ధాం! ధాం! ధాం! అని మూడు ప్రేల్పులు.

గాలిని చీలుకొని ప్రేల్పులవెంటనే మూడు ఆర్తనాదాలు దూరాన.

వానిలో ఒక పరిచయస్వ......

తుపాకి మందుపొగ సమసిపోగానే రోడ్డులో విల విల దన్నుకుంటూ ఒక.........

"ఏమో......"

అరనిముసందే ఆగిపోయింది!

ఒక్క పరుగున వైటికి దుమికాడు. నాల్గు దిక్కులనుంచి జనం కమ్ముకున్నా రప్పుడే.

పోలీసులారీ దుమ్ము లేపుతూ పారిపోయింది!

సందులోంచి దోచపేల్చుకొని ముందుకురికాడు రంగనాథం.

రక్తప్రవాహంలో తేలియాడే పారిజాత పుష్పం కాల్దు క...మ...ల...!!

నిశ్చేష్టుడైన కామనాథాన్ని వోరగంటితో చూచి చిరునవ్వు నవ్వింది కమల.

మరుసటి దినం!

ఆ చిరునవ్వుతోటే వూరేగుతూ, అనంతమైన జనప్రవాహంమధ్య పూలతెప్పరాల్లా తేలిపోయి కాలసముద్రంలో కలిసిపోయింది.

ఆరాత్రి ఆకాశంలో రశ్మిప్రభలతో వెలిగిపోయిందో నూతన తార!

కమల ప్రాణాహుతిచ్చిన స్థానంలో ఒక దేవతా విగ్రహం నెలకొల్ప బడింది.

చేతినొక కుంకుమగిన్నె!

లేతనవ్వుల సోయగంతో

లేమరూపం చిత్రించాడు శిల్పి!

—

## న్యాయమునకు ముప్పువచ్చింది

సంకుచితమైన హిందువుల స్వహక్కులను అధికారులు కాపాడజాలక పోవుటవలన నెల్లూరులో గలాటా లేర్పడినవి. హిందువుల కష్టములు న్యాయమైనవి. వారిఉత్సవములకు లైసెన్సులివ్వ లేదు. హిందువులు ఏక్రొత్తహక్కులను అడుగ లేదు. ఒక తెగవారికి ఏర్పడిన హక్కులను చలామణి చేసుకుందామంటే ఇంకో తెగవారు నొక్కడమా!

మతకలహాల కిదేకారణము. హక్కులు తిరస్కరింపబడ్డ తెగకు రక్షణలేదు, న్యాయం లేదు. నెల్లూరు హిందువులందుకు సహింపరైరి. ఒకవంక లోబడిన అధికారులను, ఒకవంక మూఢమత విశ్వాసులను ఢీకొనవలసివచ్చింది. కేవలం శాంతి రక్షణ కేవిలే, పోలీసులకు వదలవచ్చు. పరిస్థితులు విషమిస్తే, రాజ్యాంగతత్వమంటే లోపము లేర్పడితే, స్థానిక ప్రభుత్వమువారు న్యాయస్థాపన కొరకు స్థిరమత్తులు కావాలి.


—సోషల్ వెల్ ఫేర్.

## స్థానిక సంస్థలు: ప్రకాశం సర్కులరు.

ఆంధ్రదేశంలోని స్థానిక సంస్థల గురించి కాంగ్రెసువారు రాజీనామ నియ్యవలెనని ప్రకాశం పంతులవారు ప్రకటించిన రిపోర్టును ఆధిక్షేపించుచూ, పెక్కండ్రు వార్తాకుజల్లి మహాత్మునికి నివేదించు కున్నారు. మంత్రివ వెంకట్రామాగారు తమ అధికారాన్ని ఇవ్వకముందే యిలాంటి ప్రకటనలు చేయుటకు ప్రకాశంగారికి అధికారం లేదని కొందరు, ఇక గవర్నమెంటు క్రిందనుండే తమిళ కేరళములను వదలి ఆంధ్రదేశము వదులుట న్యాయముగాదని కొందరును ఆక్షేపించుచున్నారు.


# ఆ కి టు కు

## అనోట అనోట బహిర్గతమై విశ్వాన్ని విశ్వసింప జేసింది




లోధ్ర - గర్భాశయరోగ నివారిణి



# న్యూ ఇండియా

యెష్యూరెన్సు కంపెనీ లిమిటెడ్.

హెడ్ ఆఫీసు: బొంబాయి. మద్రాసు బ్రాంచి: 4/5 ఫస్టులైన్ బీచ్, మద్రాసు.

భారత సామ్రాజ్యంలోకంతా పెద్ద ఇండియన్ భీమా సంస్థ

జీవిత, అగ్ని, నావిక, ఆకస్మిక ప్రమాద భీమా పద్ధతు లిందుగలవు.

"న్యూ ఇండియా" 1919 లో సుప్రసిద్ధ 'టాటా'ల యాజమాన్యమున నెలకొల్పబడి, నేడు ఇండియాలోని ఇండియన్ ఇన్‌షూరెన్సు కంపెనీల చరిత్రలో ప్రాముఖ్యస్థానము బడసినది. ఈ కంపెనీ హామీయిచ్చేవృద్ధి బ్రహ్మాండమైనది. ఈ కంపెనీ, వాగ్దాన మూలధనము రు 3,56,05,275 లు, చెల్లించబడిన మూలధనము రు 71,21,055 లు గడచిన 1940 డిసెంబరు 31 వరకు కంపెనీ మూలధనము రు 361,18,212. ఇంతవరకు పాలసీ హక్కుల దారులకు చెల్లించినమొత్తం రు 8,50,00,000. జీవిత శాఖను 1929 లో స్థాపించినను ప్రతిసంవత్సరము రికార్డు సంవత్సరంగా నేదుంది. అపాయములను చక్కగా గుర్తించి, తక్కువ ఖర్చుతో, వ్యాపారమంతా జాగ్రత్తగా జరుపబడుచున్నది. 1940 సంIIలోని ఖర్చులు ప్రీమియంఆదాయమునకు నూటికి 23.8 లనంతునవున్నది. 11 సంవత్సరములుగా పనిచేసే కంపెనీకి యీఖర్చులు చాలాతక్కువ అని అందరూ అంగీకరిస్తారు. అమలులో వుండే జీవితవ్యాపారం 9 కోట్లు పైగావుంది. జీవితపాలసీ కొత్తపద్ధతి. ఇందులో అనేక లాభకరమైన లక్షణము లున్నవి. మాకంట్రాక్టు పద్ధతులలో ముఖ్యమైన రత్నములు మూడు: (1) ఆకస్మికముగా మరణించునపుడు వాగ్దత్తము చేసిన మొత్తమునకు రెండింతలు యివ్వబడును. (2) ఆకస్మికముగా దేహము అశక్తమైతే, అప్పటినుండి ప్రీమియమును పుచ్చుకోకుండా, నిర్ణీతమొత్తమును పాలసీ నిర్ణీత కాలమునగానీ, మరణాంతమునగానీ (ఏది ముందు జరిగితే) ఇవ్వబడును (3) పాడిగింపబడు భీమాపద్ధతి ప్రకారం ఆర్థిక అశక్తతకు సంరక్షణ మివ్వబడును. భీమాచేయు ప్రజల ప్రత్యేక అవసరముల ననుకూలించుటకై అనేక రకములైన భీమాలను మేము ప్రారంభించినాము. 1. కుటుంబ ఆదాయము. 2. ఆదర్శక ఎండోమెంటు. 3. గ్యారంటీ బోనసు 4. పిల్లలకు ప్రత్యేక భీమా. 5. ఆదర్శక ఐచ్ఛిక లాభములు. మాయేజన్సీ కంట్రాక్టు సర్వవిధములా మంచివి. మాకమిషన్ షరతులు చాలా సరసములు. విద్యాధికులును, అనేక జిల్లాలలో బంధువర్గములు కలవారును పంపే అప్లికేషనులు మా యేజన్సీల విషయములో ప్రత్యేకముగా గమనించబడును.

వివరములకు:— కె. కె. శ్రీనివాసన్, బ్రాంచిమేనేజరు.

# వార్తలు.

## రు 7000 లు.

నెల్లూరు కృష్ణమందిరమువీధి కాపురస్థులు శ్రీ ఆనముకొండ జానకిరామయ్యగారు ఇల స్ట్రేటెడ్ వీక్లీ పజిల్సు ప్రథమబహుమతిగా రు 7000 బహుమతి పొందిరని 30-11-41 ఉదయం టెలిగ్రాము ద్వారా తెలియజేయబడినది.

*

1916 సం॥ నుంచి దేశసేవాపరాయణులై గుంటూరుజిల్లా పెదపాలెం గ్రామములో శ్రీ కృష్ణాశ్రమమును నెలకొల్పి, హరిజన సేవ గావించుచుండు శ్రీ నల్లపాటి హనుమంతరావు గారిని ఆంధ్రులు బహూకరించవలయునని శ్రీ కొండా వెంకటప్పయ్య పంతుల వారొక విజ్ఞప్తిమును ప్రకటించిరి.

*

3-వ విద్యార్థిమహాసభ నెల్లూరులో జరిపిన సందర్భమున వసూలు రు 136-6-0 అనీ, ఖర్చులు 104-9-6 అనీ, నిల్వ రు 31-12-5 అని ఆ హ్వానసంఘ కార్యదర్శిగారు తెలుపుచున్నారు.

*

ఆంధ్ర నాటక కళా పరిషత్తు 11-వ సమావేశము మదరాసులో డిసెంబరు 31 ది మొదలు 31 వరకు జరుగుచుండి. అధ్యక్షులు శ్రీ డి. వి. సుబ్బారావుగారు. సభా ప్రారంభకులు శ్రీ శ్రీ పిఠాపుర సంస్థానాధీశులు. హిందూపురంవారు, రాజమండ్రివారు, చామర్లకోట వారు, వెంకటగిరి ఆమెచ్యూర్సు, ఒంగోలువారు, పుంగనూరువారు, చిత్తూరువారు, బాపట్లవారు, రామచంద్రాపురంవారు, మదనపల్లి వారు, తమ నాటకాల ప్రదర్శనం చేయ నంగీకరించారు. విద్యార్థులు కొందరు ఏకాంక నాటకాలు ప్రదర్శింతురు. ఆంధ్రనాటక విమర్శలు కూడా జరిపి తగు బహుమతు లిచ్చునట్లు తెలుపబడినది. శ్రీమతి కనుపులేటి కన్నాంబ, కవితా కళానిధి శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారికి ప్రత్యేక బహూకరణం జరుగును.

*

విశాఖపట్నంజిల్లాబోర్డువారు 15 సం॥ గా బూర్జ అను గ్రామములో దినదినాభివృద్ధినొందే A క్లాసు వైద్యశాలను అనవసరంగా E క్లాసులోకి మార్చి, బొబ్బిలి యిన్స్పెక్టరు చేరి, అందుబాటులో లేని, సరిబుజ్జిలి అను గ్రామానికి మార్చినారట. అది అన్యాయమంటారు బూర్జ గ్రామస్థులు.

★

నెల్లూరుతాలూకా పొట్లపూడి గ్రామంలోని చంద్రమౌళీశ్వర దేవస్థానానికి యం. 7. 72 సెంట్లు ఆస్తి ఉండి దానిమీద రు 200-0-0 ఆదాయము వచ్చినా, సదరు ద్రవ్యాన్ని సద్వినియోగపరుచుచున్నట్లు కనబడదని ఒకభక్తుని మొర.

★

### కీ॥ శే॥ మైదవోలు చంగయ్య పంతులు..

రా॥బ॥ చెంగయ్యపంతులవారు మద్రాసులో 29-11-41 ది స్వర్గస్థులైరి. వీరు నెల్లూరులో సుప్రసిద్ధ న్యాయవాదిగనుండి ప్రజాజీవితంలో ప్రధానస్థానము గలిగివుండిరి. రాజాగారి కాలేజీ కమిటీ అధ్యక్షులుగను, ఫండాఫీసు అధ్యక్షులుగను, మునిసిపల్ ఛైర్మనుగను నుండిరి. చాలకాలము పబ్లిక్ ప్రాసిక్యూటరుగానుండి ఎండో మెంటు బోర్డు కమిషనరుగా మద్రాసుకుపోయిరి.

—

## అఖిలభారత మహిళాసభకు నెల్లూరు జిల్లా ప్రతినిధులు

ఈ డిసంబరు నెలలో కాకినాడలో సమావేశము కానున్న అఖిల భారత మహిళా మహాసభకు నెల్లూరుజిల్లా తరపున యీ దిగువవారు డెలిగేట్లుగా ఎన్నుకోబడిరి:—

(1) కె. జానకమ్మ, (2) యస్. సుభద్రమ్మ, (3) పి. మహాలక్ష్మమ్మ, (4) వై. చెంచుకృష్ణమ్మ, (5) అల్లాడి అన్నపూర్ణమ్మ.

—పి. వి.

## బొంబాయి తెలుగు సేవా సంఘము

ఈ సంఘమువారి 1940-41 నివేదిక అందినది. ఈ సంఘము 26-11-1939 లో స్థాపించబడినది. ఇంతవరకు ప్రజాసహాయము లేకుండా వ్యక్తుల ద్రవ్యసహాయము చే నడుపబడుచున్నది. ఈ సేవా సంఘమువారి కార్యక్రమ బాహుళ్యము ఆనందము కలుగజేయగలదు. జబ్బులందు ఆంధ్రులకు ప్రత్యేక సేవ, హరిజన సేవ, బొంబయినగరములోని పాఠశాలలందు తెలుగునకు ప్రాధాన్య మొసగుట చేసినకృషి, కుర్లాయందు ప్రత్యేక ఆంధ్రపాఠశాలలను నెలకొల్పుట, వయోజనవిద్య, తెలుగు కార్మికులకు ప్రత్యేక విద్యాసౌకర్యములు, తెలుగువారు ఆంధ్ర విశ్వవిద్యాలయమునందు పరీక్షకు పోవుటకు ప్రత్యేక సౌకర్యములు, హరిజనులకు ప్రత్యేక స్మశానవాటికలు, ఆంధ్రభాషా ప్రోత్సాహము, వావిళ్లవారికి సన్మానము జరుపబడినది. ఈ సంఘము ద్వారా బొంబయిలోని తెలుగువారికి సకల సౌకర్యములు చేకూరగలవు. వీరిమార్గము లను ఇతర ఆంధ్రేతర దేశములవారు అనుసరింతురు గాక.

—

హిందూదేశంలో 389 గుడ్డలమిల్లులు, 10,000 కదుర్లు, 200,000 మగ్గములు కలవు.

## విందూరుపంచాయతీబోర్డు

—

గూడూరుతాలూకా విందూరు పంచాయితీ బోర్డుకు 1936-39 వరకు దువ్వూరు సుబ్బారెడ్డి గారు ప్రెసిడెంటుగావుండిరి. 1939 డిసెంబరులో తిరుగా ఎన్నికలు జరిగినవి. అప్పుడు నారపరెడ్డి ఆదినారాయణరెడ్డి ప్రెసిడెంటయినాడు. సుబ్బారెడ్డి వైస్ప్రెసిడెంటయినాడు.

ఆదినారాయణరెడ్డికి సుబ్బారెడ్డి ఛార్జి ఇవ్వడంలో పంచాయతీబోర్డు ద్రవ్యం రు 500 లు గా అప్పగించలేదని, జి॥ పం॥ ఆఫీసరుగారు సుబ్బారెడ్డిగారిమీద గవర్నమెంటుకు రిపోర్టు పంపిన మీదట సుబ్బారెడ్డిగారిమీద 409 I.P.C ప్రకారం ప్రాసిక్యూషన్ ఆర్డరు చేశారు. ఈకేసు సబ్‌డివిజనల్ మేజిస్ట్రేటుగారి కోర్టులో విచారణ జరిగి సుబ్బారెడ్డిగారికి 3 నెలలు శిక్ష, రు 750 లు జుల్మానా విధించినారు. ఈకేసు జిల్లా కోర్టుకు అపీలుకు వచ్చింది. జడ్జిగారు సుబ్బారెడ్డిగారిమీద ఆరోపణలు నిజంగావనిన్ని, ఆదినారాయణరెడ్డి చర్యలు అనుమానాస్పదంగావున్నవనీ, సుబ్బారెడ్డి చేవ్రాలు చేసినాడని దాఖలుచేయబడిన చార్జిలిస్టు పోర్జరీగా కనబడుచున్నదనీ, అభిప్రాయపడి క్రింది కోర్టుతీర్పు రద్దుచేశారు.

ఈకేసు విచారణ కాలంలో గవర్నమెంటువారు ఆదినారాయణరెడ్డిని వసూలు చెయ్యడంలో ఆలస్యం చేసినాడని ప్రెసిడెంటు పదవినుండి తొలగించిరి. ముత్తాయిగానుండే సుబ్బారెడ్డి ప్రెసిడెంటయినాడు. అతడుఎలెక్షన్ మీటింగు పెట్టగా, ఆదినారాయణరెడ్డిపార్టీవారు హాజరు కాకుండా వేరే మీటింగు పెట్టుకొనిరి. దానికి శ్రీ పం॥ ఆఫీసరు హాజరైనాడు. ఈరెండు మీటింగులు ఇన్స్పెక్టర్ ఆఫ్ లోకల్ బోర్డువారు రద్దుచేసి తిరుగా ఎలెక్షన్ పెట్టమన్నారు. అది త్వరలో జరుగుతుంది.

—పి. వి.

—

ఆల్లూరు:

మా పిల్లలకు యింతవిద్యా ప్రదానంచేసిన యం. శేషాచార్యులవారు అక్టోబరునెల 26 తేదిదినంగతు లైనందులకు పౌరులందరు కన్నీటితర్పణ మొసర్చిరి.

—పౌరుడు.

—


## సత్యాగ్రహము

మేనకూరు వీరరాఘవరెడ్డిగారు 4 తేది విడుదలై తే 6 ది మధ్యాహ్నం యక్స్ప్రెస్‌లో నెల్లూరు వస్తారని తెలుస్తున్నది.

అన్ని ఆంధ్రజిల్లాల కాంగ్రెసుప్రెసిడెంట్లు వెంటనే సత్యాగ్రహం చేయవలసినట్లు ప్రకాశం పంతులు భర్మ్నానా సాదరు చేశారు.

కాని నెల్లూరు ప్రెసిడెంటు వంగల్లు కోదండరామిరెడ్డి గారికి హిందూ-మహమ్మదీయకలహాల్లో నష్టపడ్డబాధితులకు సహాయము చేయు రిలీఫ్‌కమిటీ బాధ్యత ప్రకాశంపంతులే నెత్తిన వేస్తూ విరివిమాత్రం ప్రస్తుతం మినహాయింపు ఇచ్చారు.

—




## నాయుడుపేట.

యీగ్రామములో శ్రీ మహిమలూరు సీతాపతి బత్తుడుగారు నూతన గృహప్రవేశ సందర్భమున షుమారు 1000 మంది బీదలకు పైగృహములో, జాతి మతవిచక్షణ లేకుండా అన్నదానము చేసిరి.

—పి. వి.

—

## వంగరాష్ట్రంలో మంత్రాంగం రాజీనామా!

హఠాత్తుగా డిసెంబరు 1 వ నాడు వంగాల మంత్రాంగమంతా రాజీనామా ఇచ్చారు. ప్రతిపక్షవర్గం నాయకుడైన శరత్చంద్రబోసుగారు మంత్రాంగం ఏర్పరుస్తారంటారు.

# డిసెంబరు 10 వ తేదీన ఆంధ్రదేశమంతటా

## అఖండమైన స్వాగతోత్సవము

## ప్రతిభా వారి పార్వతీకల్యాణము




ఈ దిగువ కేంద్రాలలో విడుదల:

బెజవాడ : శ్రీదుర్గాకళామందిరం
బందరు : బృందావనటాకీస్
గుంటూరు : సరస్వతీటాకీస్
రాజమండ్రి : జయటాకీస్
తెనాలి : సత్యనారాయణటాకీస్
కాకినాడ : మెజస్టిక్ సినిమా
విశాఖపట్నం: సెలెక్టుటాకీస్
విజయనగరం: కృష్ణసినిమా
యేలూరు : పాండురంగటాకీస్

తారాగణం:—

శాంతకుమారి-
వెంకటగిరి-
ఘంటసాల రాధాకృష్ణయ్య-
సుబ్బారావు-
సత్యనారాయణ-
గాడేపల్లి శ్రీనివాసరావు-

*Sole Distributors:* **FAMOUS TALKIES, NELLORE.**

Printer Publisher and Editor: N. V. RAMANAIDU, Zamin Ryot Power Press, 168 Danduvari St, Nellore.

